**కథ**

# షోకేసుల్లో బొమ్మలు

**హడావిడి పడిపోతూ, చిందులు తొక్కుతూ డిన్నర్ ఏర్పాట్లు చేస్తున్న ప్రమీల ఇంట్లోకొస్తున్న తల్లిని, చెల్లిని చూడగానే గయ్‌మంది.**

**"ఇంత లేటా? ఏం కాస్త ముందుగా వస్తే పని సాయం చెయ్యాల్సొస్తుం దనా?" నడుం వంగిన తల్లి గౌరీదేవిని చెయ్యిపట్టి నడిపించుకొస్తున్న గీత అక్క మాటలు వినబడనట్టే నిర్లిప్తంగా మొహం పెట్టి లోపలికొచ్చింది.**

గౌరీదేవి మాత్రం 'చూశావా? నేన్జెప్పలా?' అన్నట్టు గీత మొహంలోకి చూసి ''అది ఆఫీసు నుండి వచ్చేసరికి లేటయింది'' అని భయం భయంగా సణిగింది.

''అబ్బ! సణక్కు. మాటాడ్తే స్పష్టంగా వినిపించేలా మాటాడు లేకపోతే అసలు మాటాడకు'' కసిరి పారేసింది ప్రమీల. బిక్కమొహం వేసుకుని సోఫాలో కూలబడింది గౌరీదేవి.

''ఏదీ కిందటి మాటు మా కలకత్తా తోడికోడలు పెట్టిన కంచిపట్టు చీర కట్టుకు రమ్మన్నాన్నా? ఇదేదో అలుగుడ్డ సింగారించుకొచ్చావేంటి? ఇవాళ ఆవిడ తల్లీ తమ్ముడు కుటుంబంతోసహా వస్తారు. ఆ చీరెవరికి ట్రాన్స్‌ఫర్ చేసావేంటి?'' గీత కట్టిన చీరవైపు గుచ్చిగుచ్చి చూసింది.

''తెచ్చానే. ముందే కట్టేసుకుంటే నలిగిపోతుందేమోననీ'' లేని ఓపిక తెచ్చుకుని పక్కగదిలోకి నడిచింది గౌరీదేవి. ఆవిడ వెనకే సంచి పుచ్చుకు వెళ్ళింది గీత చీరమార్పిడిలో సాయం చేద్దామని.

''చచ్చేంత బరువే బాబూ. నేను కట్టుకోలేను తల్లో'' అంటూ అసలే పట్టుచీర కట్టుకోవడం మానేసిన తల్లి అక్క నోటి భయానికి చెక్కముక్కలాంటి ఆ చీరని వొణికే చేతుల్తో వంగిన నడుముకు చుట్టబెడుతుంటే జాలిగా నవ్వుకుని బొమ్మక్కట్టినట్టు చీరకట్టి తల్లిని తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టింది.

''అవ్వొచ్చింది. అవ్వొచ్చింది'' ప్రమీల మనవలు సంబరంగా సోఫా ఎక్కి గంతులు మొదలెట్టారు. ''తెలుగు చందమామ కథలు చెప్పు'' డిమాండ్ చేశారు.

మళ్ళీ ప్రమీల నోరుచేసుకోవాల్సి వచ్చింది. ''ఇంగ్లీషు చందమామలో ఏం కథలేడ్చాయో తెలుగుదాంట్లోనూ అవే తగలడ్తాయి. ముందా గంతులు మానండి. బట్టలు పాడైపోతయ్'' ఆవిడ చేతికందిన వీపులు ఢామ్మన్నాయి. అందనివి తుర్రుమన్నాయి. అవును మరి. డిన్నరుకొస్తున్న అతిథుల్లో నాలుగు వేర్వేరు విదేశాలనుంచి వస్తున్నవాళ్ళు కూడా వున్నారు. వాళ్ళముందు మన సంప్రదాయ దుస్తుల ప్రదర్శన కోసం 'ఎత్నిక్' డ్రెస్సులు వేసారు. ఒకడికి పంచా లాల్చీ, ఒకడికి నెహ్రూ డ్రెస్, ఓ పిల్లకి పట్టు పరికిణీ, మరో పిల్లకి ఘాఘ్రా ఎట్సెట్రా. తీరా రావాల్సిన వాళ్ళు వచ్చేసరికి ఈ పాడు పిల్లలు ఈ ఫ్యాన్సీ డ్రెస్సులన్నీ తగలెట్టుక్కూచుంటే ఎలా?

సరైన సమయానికి సరైన వాళ్ళంతా వచ్చారు. ''ఈవిడ మా అమ్మ. తొంభై ఏళ్ళు నిండాయి'' అతిథులందరికీ పరిచయం చేసింది ప్రమీల.

''ఒక్క పన్ను ఊడలా వినికిడి తగ్గలా. ఇప్పటికీ చందమామ చదివి మునిమనవలకి కథలు చెప్తుంటుంది. రామాయణ భారతాలు సరేననుకోండి''

'అహ్, ఓహ్, వావ్ గ్రాండ్‌మా' లాంటి హాహాకారాలతో అతిథులు తమ మెచ్చుకోలు తెలియజేసారు.

''నాకు బీపీ షుగరూ. నా కొడుక్కి షుగరూ. కోడలికి ఆస్మా. మా అమ్మకి ఆరోగ్య సమస్యలేవీ లేవు. పెద్దతనం వల్ల ఎముకలు కొంచెం అరిగి నడక స్లో అయిందిగానీ మాకున్న దీర్ఘ వ్యాధులేవీ లేవు'' గర్వంగా చెప్పింది. మళ్ళీ ఆశ్చర్యాలూ, అభినందనలూ.

డిన్నరు ముందు డ్రింకులవుతుండగా తమ బ్రహ్మాండమైన షోకేసులో కళకళలాడుతున్న కళాఖండాలూ, మరబొమ్మలు రకరకాలు చూపించి వివరించింది ప్రమీల. పెద్దకొడుకు అమెరికానుంచీ, చిన్నకొడుకు ఇంగ్లాండు నుంచీ పంపిన బొమ్మలు, ఇండియాలో వుండే మూడో కొడుకు ప్యాలెస్ ఆన్ వీల్స్‌లో టూర్ చేసి సేకరించుకొచ్చిన భారతీయ కళా ప్రతీకలు. ఒకటా రెండా అబ్బో ఎన్నెన్నో!

అతిథులందరూ ఆనందించారు. తమతమ ఇళ్ళల్లో కూడా షోకేసుల నిండా నిండిపోయిన అపురూప వస్తువులని చూడ్డానికి రమ్మని ఒకళ్ళనొకళ్ళు ఆహ్వానించుకున్నారు.

★ ★ ★

పొద్దున్నే ఆరింటికి ప్రకాశం, అతని కొడుకు రవి వరండాలో కుర్చీలేసుక్కూచుని ప్రకృతి చల్లదనాన్ని, కాఫీ వేడిదనాన్నీ ఆస్వాదిస్తున్నారు. వాళ్ళు పొద్దున్న కలిసి కాఫీలు తాగుతారు, రాత్రి సీసాలు కలిసి ఖాళీ చేస్తారు. మధ్యకాలంలో కలిసి కాంట్రాక్టులు చేసి కాసుల రాసులు సంపాదిస్తారు. ప్రకాశం హయాంలో లక్షల్లో సాగిన వ్యాపారం రవి చేతికందితోడొచ్చేసరికి కోట్ల పడగ విప్పింది. మరంచేత ఆ తండ్రీకొడుకులు తరగని ధనానుబంధంతో కట్టుబడిపోయారు.


గేటు తీసుకుని లోపలికొస్తున్న గోవిందంగార్ని చూసి ''చచ్చాం, ముసలాడు ఇవాళ పొద్దున్నే తగులుకుంటున్నాడ్రా నాయనా'' అన్నాడు ప్రకాశం.

గోవిందంగారు తొంభై అయిదేళ్ళ వాడు. ప్రకాశానికి స్వయానా మేనమామ. ఇప్పటికీ క్రమం తప్పకుండా మార్నింగ్‌వాక్ చేస్తాడు. ఆయన చెల్లెలు గౌరీదేవి లాగానే కంటిచూపు, పంటి బిగువూ తగ్గలేదు. నిటారుగా నిలబడి చకచకా నడవగలడు కూడా. ముసలాయనకి దిష్టి తగిలిపోకుండా దేవుడాయన వినికిడి శక్తిని మాత్రం తగ్గించాడు. ఆయనకి రావాలనిపించినప్పుడల్లా ఈ మేనల్లుడింటికొచ్చి నాలుగక్షింతలేసి పోతుంటాడు.

ఏనాటి జ్ఞాపకాలు రెచ్చగొట్టాయో వస్తూనే ''ఏరా ప్రకాశిగా! నువ్వూ నీ కొడుకూ కలిసి కులుక్కుంటారుగానీ మీ అమ్మకూడా కొడుకు దగ్గరుండాలనుకుంటుందన్న జ్ఞానం ఏనాటికొస్తుందిరా నీకు?'' ఆవేశంగా అరిచి ఖంగు ఖంగుమని దగ్గాడు ముసలాయన.

''కూచో మావయ్యా! ఈ మంచినీళ్ళు తాగు. అమ్మాయ్! మా మావయ్యక్కూడా కాఫీ పట్రామ్మా'' గోవిందంగార్ని బలవంతంగా కూచోబెట్టి హడావిడి చేశాడు ప్రకాశం.

''నీ మర్యాదలు మంటగలపా! ఆడపిల్ల గీతమ్మ దొక్కదానిదేనా అమ్మ బాధ్యత? నీకు లేదూ? పెళ్ళి కాని పిల్ల ఒంటరిది ఒక్కత్తీ ఉందని దాన్ని కూడా అసలు నీ ఇంట పెట్టుకోవాల్సింది. అదెలాగూ లేదు. ఇంకా సర్వీసున్నా వీఆర్ఎస్ తీసుకుని ముసలి తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. అందులో వెయ్యోవంతు చెయ్యరా. ధన్యుడవవుతావు. ఇద్దర్నీ తెచ్చుకుని నెత్తినబెట్టుకు చూసుకోవాల్సిన పెద్దకొడుకువు. ఉండీ ఏం లాభం?'' నిముష నిముషానికీ వేడెక్కిపోయే వేసంగి సూర్యుడిలా ఆయన కోపం పైకి పైకి ఎక్కిపోతోంది. ఎక్కదూ మరి! ఆయన తల్లి కడుపారా కన్న పదముగ్గురు సంతానంలోనూ ఆఖరున పుట్టిన గౌరీదేవొక్కతే ఆడసంతానం. తన ముద్దుల చెల్లికి వృద్ధాప్యంలో కొడుకు అండలేదంటే ఆయనక్కోపం రాదామరి?





''కాఫీ తాగు. రంకెలు కట్టిపెట్టు. ఏడో తారీకు నాన్న తద్దినం. చుట్టాలందర్నీ పిలుస్తున్నాను. నువ్వొచ్చి తగలడు. నాలుగు పిండాకూడు ముద్దలు తిని పోదువుగాని'' అన్నాడు ప్రకాశం ముసలాయనకెలాగూ వినబడదు కదా అని.

అదే విషయాన్ని కాస్త మర్యాదైన భాషలో కాయితం మీద రాసి చూపించాడు ''వస్తాలే, మీ అమ్మని పిలుస్తావా?'' గోవిందంగారు వెటకారంగా అడిగాడు.

'అమ్మమ్మ! ఎంత మాట' అన్న అర్థం స్ఫురించేలా నాలిక బైటబెట్టి, ముక్కున వేలేసుకుని చెంపలు వాయించుకుని దణ్ణం పెట్టాడు ప్రకాశం.

''వంక దణ్ణాలూ నువ్వూనూ. నక్క వెధవ్వి. నువ్వు మారవు'' తిట్టుకుంటూ దగ్గర్లోనే వున్న తన కొడుకింటికి పోయాడు గోవిందంగారు.

★ ★ ★

తద్దినం నాడు పెళ్ళి వారిల్లులా కళకళలాడిపోయింది ప్రకాశం ఇల్లు. ప్రమీల తన స్వదేశీ మరియు విదేశీ కొడుకులు, వాళ్ళ కుటుంబాలతో సహా విచ్చేసింది. గీత, గౌరీదేవిలకు కారు పంపి రప్పించారు. బంధువర్గంలో ఎనభై శాతం మంది హాజరయ్యారు. తండ్రీకొడుకులు వ్యాపారాభివృద్ధికి సహకరించగల పెద్దమనుషులు వచ్చారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. వాళ్ళకి ప్రకాశం, రవి 'తద్దినమనగానేమి? అదెవరికి, ఎందుకు పెడుదురు?' మొదలైన విషయాలన్నీ వివరించారు. విన్నవారూ, చెప్పినవారు కూడా ఆనందాబ్ధిలో ఓలలాడారు.

ఆనాటి కార్యక్రమానికి హైలైటుగా గౌరీదేవి, గోవిందంగార్లను పరిచయం చేసారు. తొంభై దాటిన వృద్ధులు ఎంత ఆరోగ్యంగా ఉన్నారో! అన్నా చెల్లీ అనుబంధం ఇన్నేళ్ళైనా చెక్కుచెదరక ఎంత ముద్దొస్తోందో. ఆశ్చర్యానందాలు ప్రకటించారు అతిథులంతా. వాళ్ళిద్దరూ ఆవకాయ పెచ్చుల్ని టెంకనుంచి తమ సొంతపళ్ళతో విడగొట్టి కర్రూ కర్రూమని నవిలి తింటూంటే అభినందనల వర్షం కురిపించారు. కొందరైతే ముచ్చటపడి ఇంచక్కా ఫొటోలు కూడా తీసుకున్నారు.

రవి పిలిపించిన వీడియోగ్రాఫరు ఈ సంబరాన్నంతా వీడియో తీసాడు. తన ఇంట 'తద్దినం పార్టీ' ఇంత గొప్పగా విజయవంతమైనందుకు ఉబ్బి తబ్బిబ్బై పోయాడు ప్రకాశం.

భోజనాలు పూర్తయ్యీ అవ్వగానే ప్రమీల వచ్చినంత ఆర్భాటంగానూ తిరిగి ఇంటికి బయల్దేరింది. ''ఇవాళ డిన్నరుకి మా ఆస్ట్రేలియా ఆడపడుచూ వాళ్ళొస్తారు. రేపు తెల్లారురఝాము ఫ్లైటులో బొంబే వెళ్ళిపోతారు వాళ్ళు. చాలా టైట్ షెడ్యూల్‌తో వచ్చారు వాళ్ళు ఈసారి ఇండియాకు. పదిరోజులుగా చాలామంది చుట్టాలిళ్ళు కవర్ చేసుకొస్తున్నారు. ఇవాళ మా ఇంట్లో డిన్నర్‌కి అబ్బో, చాలా కష్టమ్మీద ఒప్పుకున్నారు. అమ్మా, ఇప్పుడు నువ్వూ రావే మాతో. మా ఆడపడుచుని చూడవూ?'' అంది గొప్పగా.

రమ్మన్న ఆహ్వానం కన్నా ఈవిడని వాళ్ళముందు ప్రదర్శించాలన్న ఆత్రం ఎక్కువగా కనపడింది చుట్టూవాళ్ళకి. రాలేను, ఓపిక లేదంటే ఏం రభసవుతుందోనన్న భయం కొద్దీ ''ఎందుకు రానూ! వస్తాను. అబ్బో, మీ ఆడపడుచుని చూసి ఎన్నేళ్ళయిందో. నీ చిన్నకొడుకు బారసాలప్పుడు కాబోలు చూసాను. తరువాత వాళ్ళదేదో దేశం వెళ్ళిపోయారాయె'' సన్నగా గొణుగుతూ ముని మనవడి భుజం మీద చేతులేసి నెమ్మదిగా కారువైపు అడుగులేసింది గౌరీదేవి.

''ఈవిడేం గొణుగుతుందో ఈవిడకే తెలియాలి. పుడకల్తోకానీ పోదీవిడ గొణుగుడు గుణం'' అని విసుక్కుంటూ ధడీలని కారు తలుపేసుకుంది ప్రమీల.

రోడ్డుమీద పోతున్న ఆటో ఆపి తన మానాన తను మాటామంతీ లేకుండా వెళ్ళిపోతున్న గీతని 'ఈ పూటకిక్కడుండిపోవే. రేపెళ్ళచ్చు' అని ప్రకాశం అనలేదు. 'ఆటో ఎందుకే మేమంతా మూడు కార్లు వేసుకొచ్చాం. ఏదో ఓ కారెక్కు నిన్ను దింపేసి మేం వెడతాం. లేకపోతే మాతోనే మా ఇంటికిరా' అని ప్రమీలా అనలేదు.

పోడూరి కృష్ణకుమారి

★ ★ ★

గీత ప్రాణసఖి సుజాత పొద్దున్నే గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో సకుటుంబంగా దిగి సరాసరి గీతింటికొచ్చి తలుపు తట్టింది. గీత ఆనందంతో హడావిడి పడిపోతూ వాళ్ళ స్నానాలకీ, టిఫిన్లకీ ఏర్పాట్లు చేస్తుంటే ప్రమీల ఫోను చేసింది. ''మేం అందరం మా ఫ్రెండింట్లో బారసాలకి వెడుతున్నాం. నువ్వొచ్చి అమ్మని నీ ఇంటికి తీసుకెళ్ళు. మాకు దింపి వెళ్ళడం కుదరదు. టైమ్ లేదు'' అంది.

గీత తన పరిస్థితి వివరించి, వంట సగం అయినా చేసి సుజాతకి ఇల్లు అప్పగించి వస్తానంది. ''అమ్మకి అన్నం పెట్టేసి, పక్కింటావిడని కాస్త అప్పుడప్పుడొచ్చి చూస్తుండమని చెప్పి మీ దారిన మీరు వెళ్ళండి నేను రావడం ఆలస్యమైనా పెద్దావిడ నీరసపడకుండా ఉంటుంది'' అంది.

''అబ్బ! మాకు తయారవడానికే టైము చాలదు. ఇంకీవిడకోసం కుక్కరు పెట్టిదించా. మాక్కుదరదు బాబూ. పొద్దున్నే తెప్పించిన ఇడ్లీలేవో మిగిలాయిలే. ఆకలేస్తే అవే తింటూంటుంది. నీక్కుదిరినప్పుడు నువ్వురా'' నిర్లక్ష్యంగా అనేసి ఫోను పెట్టేసింది ప్రమీల.

రెండు కుక్కర్లలో అన్నం, పప్పూ వండేసి చకచకా కూర తరిగేసింది గీత. సుజాతకి క్షమాపణలతో కూర పూర్తిచేసే పని అప్పగించింది. తల్లికోసం బయల్దేరబోతూ ఎందుకైనా మంచిదని కొంచెం అన్నం, పప్పు, పెరుగు చిన్న క్యారియర్లో సర్దుకుని ఆటో పట్టుకుని ప్రమీల ఇల్లు చేరింది.

అప్పటికే పదకొండు దాటిపోయింది. గౌరీదేవి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకు కూచునుంది. గబగబా తను తెచ్చిన అన్నం, పప్పు కంచంలో వడ్డించి తల్లిని లేవదీసి టేబుల్ ముందు కుర్చీలో కూచోబెట్టింది. ముసలావిడ గబగబా నాలుగు ముద్దలు తిని తేరుకుంది. ''అమ్మయ్యా! ఇవాళ ప్రాణం పోయిందనే అనుకున్నానే అమ్మాయ్! ఎన్ని తిన్నా పదకొండింటికల్లా అన్న సారం పడకపోతే ప్రాణం గిలగిల లాడిపోతుందే అదేవిటోగానీ'' అంది. అన్నం తిన్నాక ఆవిడ్ని ఓ అరగంట పడుకోనిచ్చింది. తరువాత ఆటో పిల్చుకొచ్చి, ఇంటి తాళాలు పక్కింటావిడకిచ్చి తల్లిని తన ఇంటికి తీసుకుపోయింది గీత.

ఆరోజు రాత్రి కబుర్లు చెపుతూ తన పక్కన పడుకున్న సుజాతతో, ''పొద్దున్న నే వెళ్ళేటప్పటికి శోషొచ్చి పడిపోయే స్థితిలో ఉంది మా అమ్మ. డైనింగ్ టేబుల్‌మీద పెద్ద కేసరోల్‌లో రెండిడ్లీలు మాత్రం ఉన్నాయి. అవి తిని ఎంతసేపుండగలదనుకుందో ప్రమీల. ఆవిడ తినే ఆ కాస్త అన్నమూ టైముకి తినకపోతే ఆగలేదు పెద్దావిడ. నాకేదన్నా అడ్డంకి వచ్చి నేను సాయంత్రం దాకా వెళ్ళలేకపోయుంటే ఏమయ్యేదో ఆవిడ'' అక్క నిర్లక్ష్యాన్ని చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది గీత.

''ఎవరికైనా ఆ స్థితి వచ్చేదే కదా? అమ్మ పిల్లలం అందరం యాభైలు దాటి అరవైల్లో అడుగేస్తున్న వాళ్ళమే. మా పెద్దన్నయ్యకైతే డెబ్భై దాటాయి. మనికీ ఎప్పటికైనా ఈ పరిస్థితి వస్తుంది అన్న జ్ఞానం ఒక్కళ్ళల్లో కనిపించదు'' అంటూ బాధపడుతున్న గీతని సుజాత ఓదార్చింది.

★ ★ ★

ప్రకాశం మనవడు, రవి కొడుకు అయిన తేజ ఎమ్‌సెట్ ర్యాంకు సాధించి మెడిసిన్‌లో సీటు సంపాదించిన సందర్భంగా బ్రహ్మాండంగా పార్టీ ఇచ్చారు. పార్టీకి యథావిధిగా చుట్టాలు, స్నేహితులు దేశ విదేశ వ్యాపార భాగస్తులు చాలామంది వచ్చారు. ప్రమీల సపరివారంగా వేంచేసింది. సంఘ సేవా కార్యక్రమాల్లో ఊపిరి పీల్చడానిక్కూడా టైము లేనంత బిజీగా ఉండే గీత కూడా ఎలాగో తీరిక చేసుకుని తన వాళ్ళందర్నీ ఓసారి చూడచ్చు కదా అని వచ్చింది.

వ్యాపారాభివృద్ధి కోసం యూరోపు దేశాలు పర్యటించి ఈమధ్యనే తిరిగొచ్చాడు రవి. పర్యటనలో తను సేకరించిన వింత వింత వస్తువులు అతిథులకి ప్రదర్శించాడు. ఆడవాళ్ళు కొత్తగా సేకరించిన నగలు చీరలు ప్రదర్శించుకుని చర్చించుకుంటున్నారు. గీత అందర్నీ చూస్తూ ఓ మూల కూచుంది.

అందర్నీ చూస్తూ మరోమూల నుంచున్న తేజ ఉన్నట్టుండి ఏదో పూనిన వాడిలా ఊగిపోతూ మధ్యలోకొచ్చి నిలబడి ''బంధువులారా, స్నేహితులారా!'' అన్నాడు పెద్దగొంతుతో. అందరూ ఆశ్చర్యంతో మాటలాపేసి అతని వైపు చూశారు.

''మా షోకేసులు ఎప్పుడూ కొత్త కొత్త బొమ్మలతో నిండిపోతుంటాయి. కిందటి పార్టీలో మీరు చూసినవి వెనక్కి పెట్టేసి ఇప్పుడు మా డాడీ మీకు ఇంకా కొత్తరకం బొమ్మలు, ఆర్ట్ పీసెస్ చూపిస్తున్నారు. మళ్ళీ ఇంకో పార్టీకి మీరు వస్తే ఇంకా ఏవేవో చూపిస్తారు. అయితే కొంత కాలం క్రితం వరకూ ప్రతి పార్టీలోనూ మార్చకుండా అందరికీ ప్రదర్శించే బొమ్మ మాకు ఇంకోటుండేది. ఆ బొమ్మ ఇప్పుడు లేదు. చచ్చిపోయింది'' అన్నాడు.

''బొమ్మ చావడమేవిట్రా? వెర్రి వెధవా?'' అన్నాడు ప్రకాశం మత్తెక్కిన కళ్ళతో మనవడ్ని చూస్తూ. తన గ్లాసులో డ్రింకు వాడి గొంతులోకెళ్ళిందా ఏవిటని చేతిలోని గ్లాసుకేసి అనుమానంగా చూసుకున్నాడు రవి. ''మా అబ్బాయికి తెలుగు సరిగ్గా రాదు. మీరంతా ఏమనుకోకండి. క్షమించండి'' అంది తేజ తల్లి గర్వంగా.

''మా ఇంట్లోనూ మా ప్రమీలత్త ఇంట్లోనూ ఎన్ని పార్టీలైనా అన్నిటిలోనూ ఎవర్‌గ్రీన్ షోపీస్‌గా ఉండేది గౌరీదేవి అనే పేరుగల మా తాతగారి తల్లి, అంటే మా తాతమ్మ. ఆవిడ ప్రమీలత్తకూ, గీతత్తకూ కూడా ఇంకో నలుగురికీ కూడా తల్లే. ప్రమీల, గీతలు మాకు బహుశా అమ్మమ్మ వరసలవుతారేమోగానీ మాకు అత్తలనడమే అలవాటయింది. అది వేరే విషయం. ఒక్కోసారి మా తాతమ్మ అన్నగారు గోవిందంగారిని కూడా మా పార్టీల్లో ప్రదర్శించడం జరుగుతుండేది. మా ఇళ్ళల్లోనూ మా చుట్టాల ఇళ్ళల్లో పార్టీలు, వివాహాది శుభకార్యాల్లోనూ, ఒక్కోసారి అశుభకార్యాల్లోనూ గోవిందం గౌరీదేవిగార్లు ప్రధాన ప్రదర్శనీయ ఐటమ్స్‌గా ఉండి అతిథి అభ్యాగతుల్ని ఆనందపరుస్తుండేవారు.

పార్టీ అయ్యాక మీకు చూపించిన వస్తువుల్ని కొన్నిటిని షోకేసుల్లోనూ, ఇంకొన్నిటిని బీరువాల్లోనూ దాచుకుంటాం. అలాగే మా తాతమ్మని కూడా పార్టీలో ప్రదర్శించాక మా గీతత్త ఇల్లు అనే బీరువాలో దాచేసి మర్చిపోయేవాళ్ళం. పాపం గీతత్తే ఆవిడ్ని జాగ్రత్తగా మెయిన్‌టెయిన్ చేసి మళ్ళీ మా వాళ్ళు ప్రదర్శనకు తెమ్మన్నప్పుడల్లా తెచ్చేది. ఇపుడా తాతమ్మగానీ ఆవిడ అన్నగారుగానీ లేరు. ఇవాళ్టి పార్టీ ఎంతో వెలితిగా అనిపిస్తోంది.

అయితే ఒకటే ఆశాకిరణం. నేను డాక్టర్నై, ఓ ఇంటి వాడినై పార్టీలిచ్చే వయసుకెదిగాక నా ఇంట్లో పార్టీల్లో ప్రధాన షోపీసుగా బహుశా మా తాతయ్య ఉంటాడు. తాతమ్మలాగే ఆయనా మిమ్మల్నందర్నీ ఆనందాశ్చర్యాలతో ముంచెత్తి మంచి ఎంటర్‌టెయిన్‌మెంటునందిస్తాడు. ఆయనకు భగవంతుడు సుదీర్ఘమైన వృద్ధాప్యం ఇచ్చుగాక!'' తేజ ఉపన్యాసం ముగించాడు.

ప్రకాశం, ప్రమీల నోటమాట రాక వాడికేసి వెర్రిచూపులు చూస్తూ నుంచున్నారు. అతిథులంతా నిశ్శబ్దంగా ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకుని ప్రకాశం వైపు జాలిగా చూశారు. ఎందుకోగానీ గీతమ్మ తల్లి వెక్కి వెక్కి ఏడ్చింది.

✤

